ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన

జేఎన్టీయూకే, జనవరి 11: జిల్లాలో ప్రత్తిపాడు గిరిజన గ్రామాల్లో పర్యటించినట్లు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్ తెలిపారు. జేఎన్టీయూకే అతిథిగృహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనాపురంలో గిరిజన భూమి వివాదం ఉందని, అక్కడ 40మందే ఉంటున్నారని అన్నారు. పాండవులపాలెం, వంతాడ గ్రామాల్లో పర్యటించామన్నారు. గురువారం జేఎన్టీయూకేలో గిరిజనులనుంచి వినతులు స్వీకరించామన్నారు.

కోడి పందాలకు అనుమతి లేదు: కలెక్టర్

కాకినాడ సిటీ, జనవరి 11: సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలోని ఏ ప్రాంతంలోను కోడిపందాలు, జూద క్రీడలు నిర్వహించడానికి అనుమతి లేదని, ఎక్కడైనా బరులు వేస్తే వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేయాలని కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని కోర్టు హాల్‌లో కోడి పందాలు నిషేధంపై ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ విషయంలో ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కోడి పందాల నిషేధం విషయంలో కోర్టు స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చిందని, ఇందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని అన్నారు. సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జె.సీతారామారావు, కాకినాడ, పెద్దాపురం డీఎస్పీలు, జిల్లాస్థాయి అధికారులు, పశుసంవర్థకశాఖ సంక్షేమ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీకి ముచ్చెమటలు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

- జిల్లాలో అధికార వైసీపీకి షాక్‌ల మీద షాక్‌లు
- టిక్కెట్ దక్కని సిట్టింగ్ ఎమ్మెల్యేల తిరుగుబాట్లు
- ముద్రగడ జనసేనలో చేరుతారని ప్రచారం

జిల్లాలో అధికార వైసీపీకి షాక్‌ల మీద షాకులు తగులుతున్నాయి. ఇంతకాలం అధిష్ఠానం ఎంత నియంతృత్వంగా వ్యవహరించినా పార్టీ ఎమ్మెల్యేలు ఇప్పుడు టిక్కెట్లు చిరిగిపోవడంతో తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారు. తమ స్థానంలో కొత్త ఇన్‌చార్జులను నియమించిన నేపథ్యంలో ధిక్కార అడుగులు వేస్తున్నారు. తన స్థానంలో మాజీ ఎమ్మెల్యే వరుపులను కొత్త ఇన్‌చార్జిగా నియమించడంతో ఆగ్రహంతో ఉన్న ఎమ్మెల్యే పర్వత శుక్రవారం నుంచి నియోజకవర్గంలో రౌతులపూడి మండలంనుంచి ప్రజాదీవెన కార్యక్రమానికి సిద్ధమవుతుండడం వైసీపీని వణికిస్తోంది. కొత్త ఇన్‌చార్జిగా వరుపులను నియమించిన తర్వాత కూడా ఎమ్మెల్యే బలప్రదర్శన దిశగా అడుగులు వేస్తుండడంతో ఏం చేయాలో తెలియక తలబాదుకుంటోంది. ఇప్పటికే ఎమ్మెల్యే తీరుతో నియోజకవర్గంలో పార్టీ రెండు ముక్కలై దిద్దుబాటు చేయలేనంతగా నష్టపోవడంతో క్యాడర్ సైతం నిట్టూర్చుతున్నారు. పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు నేడు పుట్టినరోజు వేడుక సాక్షిగా అనుచరులతో భారీ సమావేశం నిర్వహిస్తున్నారు. తన బలాన్ని ఈ వేడుక ద్వారా చాటి టిక్కెట్ నిరాకరించడం తప్పిదం అనే సంకేతాలను పార్టీకి పంపాలని యోచిస్తున్నారు. ఇప్పటికే జగ్గంపేట ఎమ్మెల్యే చంటిబాబు జనసేన వైపు చూస్తున్నారు. తాజాగా ముద్రగడ వైసీపీకి షాక్ ఇచ్చారు. అనేక విషయాల్లో వైసీపీ పెద్దలు తనను అవమానించారనే ఆగ్రహంతో కుతకుతలాడుతున్నారు. దీంతో త్వరలో జనసేనలో చేరుతారంటూ ప్రచారం సాగుతోంది. ఇలా వరుస పరిణామాలతో ఫ్యాన్ వణుకుతోంది.

'ప్రత్తిపాడు, పిఠాపురం స్థానాలనుంచి పోటీ'

కిర్లంపూడి, జనవరి 11: మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం కుమారుడు గిరిబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. చిట్‌చాట్‌లో మాట్లాడుతూ టీడీపీ, జనసేన ఏ పార్టీలోకైనా తన తండ్రి వెళ్లే అవకాశం ఉందని, వైసీపీలోకి వెళ్లడానికి ఆయనకు ఆసక్తి లేదని స్పష్టం చేశారు. ఇద్దరం పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని, ఏదైనా పార్టీలోకి చేరిన తర్వాతే నిర్ణయం ఉంటుందని తెలిపారు. కాకినాడ పార్లమెంట్, ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నామన్నారు.

సరిహద్దులవద్ద పటిష్ట నిఘా ఉండాలి: ఎస్పీ

కాకినాడ క్రైం, జనవరి 11: అంతరాష్ట్ర సరిహద్దుగా ఉన్న కేంద్ర పాలిత ప్రాంతం సరిహద్దువద్ద పటిష్టనిఘా ఏర్పాటు చేయాలని, అక్రమ మద్యం, గంజాయి రవాణా కాకుండా బందోబస్తు నిర్వహించాలని ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ఆదేశించారు. తాళ్లరేవు మండలం మల్లవరంవద్ద ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టును గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యానాంవద్ద కోనసీమ జిల్లానుంచి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలన్నారు. సుంకరపాలెం ఎస్‌ఈబీ చెక్‌పోస్టు, అరిటికాయలంకవద్ద ఏర్పాటు చేయబోయే చెక్‌పోస్ట్ ప్రదేశాల్ని పరిశీలించారు.

హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్





ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు



విజేతలు వీరే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

యువతిని ప్రేమించి మోసగించిన కేసులో 15 ఏళ్ల జైలు

గండేపల్లి, జనవరి 11: యువతిని ప్రేమించానని చెప్పి మానసికంగా, శారీరకంగా మోసగించిన వ్యక్తికి రాజమండ్రి 8వ అడిషనల్ స్పెషల్ జడ్జి వై.చెన్నయ్యనాయుడు 15 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించినట్లు గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలో యర్రంపాలెం గ్రామానికి చెందిన 29 ఏళ్ల బండి దుర్గాప్రసాద్ ఓ అమ్మాయిని ప్రేమించానని నమ్మించి మోసం చేయడంతో ఆమె అక్టోబరు 8, 2020లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ శోభన్‌కుమార్ కేసు నమోదు చేయగా సీఐ సురేష్ బాబు దర్యాప్తు చేశారు. వాదోపవాదనలు పూర్తయిన తర్వాత గురువారం జడ్జి తీర్పు వెలువరించారు.

హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా మేడపాటి షర్మిళారెడ్డి



రాజమహేంద్రవరం, జనవరి11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిళారెడ్డి నియమితులయ్యారు. ఇటీవల రుడా చైర్‌పర్సన్‌గా ఆమెను కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన రెండో రోజునే వాటిని రద్దు చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఎంపీ మార్గాని భరత్‌రామ్ పట్టుపట్టి మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావుకు రుడా పదవి వచ్చేటట్టు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో అనూహ్యంగా ఆమెకు హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవి దక్కింది. ఉత్తర్వులు స్వయంగా తీసుకుని షర్మిళారెడ్డి, ఆమె భర్త అనిల్‌రెడ్డి బయలుదేరినట్టు చెప్పారు.

హరిహర సదన్‌కు రూ.5 లక్షలు



ఆలయ పీఆర్వోకు విరాళం అందిస్తున్న దాతలు

అన్నవరం, జనవరి 11: అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మితమైన హరిహర సదన్ కాటేజీకి గురువారం ఒక దాత రూ.5 లక్షలు విరాళంగా సమర్పించారు. నెల్లూరు జిల్లా కమ్మపాలెంనకు చెందిన బెల్లం జయసందీప్ ఈ మొత్తాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆయన అభినందించి వారికి స్వామి వారి ప్రత్యేక దర్శనం ప్రసాదాలు అందజేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



కాజులూరు, జనవరి 11: కాజులూరు శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఆకుల లక్ష్మణరావు(38) ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. గ్రామానికి చెందిన సలాది రాంబాబు ఇంట్లో డ్రిల్లింగ్ మిషన్‌తో పనిచేస్తుండగా విద్యుత్ ప్రమాదానికి గురయ్యాడు. ఆసుపత్రికి తరలించేలోపే లక్ష్మణరావు చనిపోయాడు. లక్ష్మణరావు జనసేన కార్యకర్తగా ఉన్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. లక్ష్మణరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విరవాడలో దారుణహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పిఠాపురం రూరల్, జనవరి 11: పిఠాపురం మండలం విరవాడలో వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. ఈ సంఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. తుని మండలం హంసవరం గ్రామానికి చెందిన సిద్ధాంతపు అప్పారావు విరవాడలోని ఇటుకల బట్టీలో పనిచేస్తున్నాడు. అక్కడ భార్య చిన్నారి, ఇద్దరు పిల్లలతో కలిసి నాలుగేళ్లుగా నివాసముంటున్నాడు. ఇంట్లో అప్పారావు నిద్రిస్తుండగా గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన సురేష్ అనే వ్యక్తి కత్తితో విచక్షణారహితంగా నరికి హత్య చేశాడు. భార్య కేకలు వేయడంతో సురేష్ అక్కడి నుంచి పరారయ్యాడు. కాగా అప్పా రావు, సురేష్‌కు గతంలో ఖమ్మంలో ఇటుక బట్టీలో కలిసి పనిచేసే సమయంలో పరిచయం ఏర్ప డింది. వీరిద్దరికి గతంలో పలుమార్లు గొడవలు జరిగినట్లు చెబుతున్నారు. ఒక మహిళతో సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగిందని సమాచారం. సంఘటనా స్థలాన్ని పిఠాపురం సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ గుణశేఖర్ పరిశీలించారు.



అప్పారావు(ఫైల్)

శ్రీప్రకాష్‌లో సంక్రాంతి సంబరాలు



సంప్రదాయ వస్త్రధారణతో చిన్నారులు

పెద్దాపురం, జనవరి 10: స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా జరిగాయి. సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలతో పాఠశాలలో సందడి చేశారు. భోగి మంటలు, డూడూ బసవన్నల ఆటలు, బొమ్మల కొలువులు, పతంగులు, రంగురంగుల రంగవల్లులు, జంగమదేవరలు, హరిదాసుల కీర్తనలు, తొక్కుడు బిళ్ల, దూదూపుల్ల ఆటలతో పల్లె వాతావరణం తలపించేలా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. దీంతో పాఠశాల ప్రాంగణం అంతా పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించేందుకు తమ పాఠశాలలో ప్రతి సంవత్సరం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అలాగే వంటింటి మహారాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ప్రొఫెసర్ సంతానం, సమీర, మేనేజర్ రామకృష్ణ, అకడమిక్, కల్చరల్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



విజయ్‌ప్రకాష్‌తో బాలిక సరదా ముచ్చట

800 అడుగుల భోగి దండ



భోగి దండతో కుటుంబ సభ్యులు

అమలాపురం రూరల్, జనవరి 11: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సమనస పంచాయతీ పరిధిలోని రంగాపురానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు భూపతిరాజు విశ్వనాథరాజు కోడలు శ్రీరామసత్య దేశీయ ఆవుపేడతో 800 అడుగుల భోగి పిడకల దండ తయారు చేసింది. పిల్లలు మౌక్తిక, కార్తీక సహకారంతో 15 వేల భోగి పిడకలతో దండను రూపొందించింది.

జగన్‌ను దళితులే ఓడిస్తారు

అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్



మాట్లాడుతున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 11: అధికారాన్ని ఇచ్చిన దళితులే ముఖ్యమంత్రి జగన్‌ను రాబోయే ఎన్నికల్లో చిత్తుగా ఓడించి గద్దె దించబోతున్నారని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరం రాజీవ్ గాంధీ విద్యాసంస్థల్లో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ అధికారంలోకి వచ్చాక దళితుల జీవితాలు బాగుపడతాయని ఆశించిన వారి ఆశలపై నీళ్లు చల్లాడన్నారు. దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు వంటివి అధిక మయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత యువకులను కొట్టిచంపితే రూ.10 లక్షలు ఇచ్చి సెటిల్ చేసుకోవడం, అత్యాచారం చేసి చంపితే నిందితులను అరెస్టులు చేయకుండా అడ్డుపడడం, ఇద్దరు దళిత యువకులకు శిరోముండనం చేస్తే చర్యలు తీసుకోకపోవడం, డాక్టర్ సుధాకర్‌ను దారుణంగా ఇబ్బందులకు గురిచేసి అతను చనిపోవడానికి కారణం కావడం ఇలా అనేక సంఘటనలు ఉన్నాయన్నారు. అందుకే దళితులంతా ఏ ఓటుతో జగన్‌ను సీఎం చేశారో అదే ఓటు తో కిందకు దించబోతున్నారని చెప్పారు. వచ్చే నెల 8న రాజమహేంద్రవరం బొమ్మూరులో దళిత సింహగర్జన నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సభ ద్వారా దళితుల సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. అమలాపురం నుంచి తాను ఎంపీగా పోటీ చేస్తున్నానని చెప్పారు. సమావేశంలో జీవీ శ్రీరాజ్, యర్రా రామకృష్ణ పాల్గొన్నారు.

తల్లి ఒడికి చేరిన చిన్నారి

తల్లిని గుర్తించి క్షేమంగా అప్పగించిన పోలీసులు



చిన్నారిని తల్లికి అప్పగిస్తున్న సీఐ విజయ్ శంకర్

రాజమహేంద్రవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రైల్వే పోలీసుల(జీఆర్పీ) ప్రత్యేక చొరవతో తల్లి నుంచి దూరమైన చిన్నారిని నెలన్నరలో తిరిగి ఆమె ఒడికి చేర్చారు. జీఆర్పీ సీఐ విజయ్ శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గతేడాది నవంబరు 18న రాజమండ్రి రైల్వే స్టేషనులోని ఏడాదిన్నర పసిపాప ఒంటరిగా ఏడుస్తోందంటూ డ్యూటీలో ఉన్న ఆర్పీహెచ్‌సీ ఎస్‌వీవీ సత్యనారాయణకు చెప్పారు. ఆయన ఏఆర్ఎస్ఐ ఎస్.సత్యనారాయణతో హుటాహుటిన వెళ్లి పాపను సంరక్షించి వివరాల కోసం వాకబు చేయగా ఫలితం లేకపోయింది. దీంతో కేసు నమోదు చేసి.. చైల్డ్ వెల్ఫేర్ వాళ్లకు సమాచారమివ్వగా వాళ్లు పాపను తీసుకెళ్లారు. సీఐ విజయ్ శంకర్ పర్యవేక్షణలో ఆర్పీ ఎస్ఐ పి.లోవరాజు, ఆర్‌పీ ఎస్ఐ కె.మావుళ్లు కేసు దర్యాప్తు చేపట్టారు. మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారాన్ని కల్పించారు. ఇన్‌స్టాగ్రాంలో చూసిన పాప బంధువు ఒకరు కాట్రేనికోన మండలం కొత్తపాలెంకి చెందిన పాప తల్లి ఓలేటి కావేరికి విషయాన్ని చేరవేశారు. దీంతో ఆమె జీఆర్పీ పోలీసులను గురువారం ఆశ్రయించగా పాపను అప్పగించారు. ఆ రోజున తల్లి ఇంటికి బయలుదేరి పాప తినడానికి ఏదైనా తీసుకురావడానికి స్టేషను బయటకు వెళ్లగా మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఆమె కళ్లు తిరిగి పడిపోయిందని.. తర్వాత వచ్చి చూడగా పాప కనబడకపోవడంతో అప్పటి నుంచీ వాళ్లు వెతుకుతున్నారని సీఐ చెప్పారు. కేసులో ప్రతిభ చూపిన సీఐ విజయ్ శంకర్, ఎస్ఐలు మావుళ్లు, లోవరాజు ఇతర సిబ్బందికి రైల్వే పోలీసు ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, రైల్వే డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు ప్రశంసించారు.

సోదరుడి హత్య కేసులో ఏడేళ్ల జైలు

రాజవొమ్మంగి జనవరి 11: తన సోదరుడిని తలపై కొట్టి చంపిన ఘటనలో నిందితుడికి గురువారం ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని కొమరాపురం గ్రామానికి చెందిన మార్తి వేంకటేశ్వరులు(60) ఇంటి స్థలాల విషయంలో తన తమ్ముడు తాతారావుతో ఘర్షణ పడి, కర్రతో తన తమ్ముడిని తలపై కొట్టడం వల్ల తాతారావు చనిపోయాడు. 2021లో జరిగిన ఈ ఘటనపై అప్పటి సీఐ నాగదుర్గారావు కేసు నమోదు చేసి వేంకటేశ్వరులుని అరెస్టు చేయగా, వేంకటేశ్వరులు బెయిల్‌పై బయటకు వచ్చి కోర్టు విచారణకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతుండడంతో జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు అరెస్టు చేసి జైలుకు పంపారు. రాజమండ్రి కోర్టులో గురువారం వేంకటేశ్వరులుకు ఏడేళ్లశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు తెలిపారు.

వనదుర్గ ఆలయంలో ప్రత్యంగిర హోమం

అన్నవరం, జనవరి 11: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం ప్రత్యంగిర దేవతను ఆవాహన చేయించి అమ్మవారికి పారాయణలు, జపములు నిర్వహించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కాకినాడ

ప్రత్యేక హోదాపై జగన్ ప్రశ్నించకపోవడం విచారకరం

● కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు

కాకినాడ(ఆంధ్రజ్యోతి), జనవరి 11: ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో సీఎం జగన్, ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రధాని మోదీని ప్రశ్నించకపోవడం విచారకరమని కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు విమర్శించారు. ఏలేశ్వరంలోని షిర్డీనగర్‌లో ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఉమ్మిడి వెంకట్రావు ఇంటివద్ద నియోజకవర్గ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి పళ్లంరాజు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ చిలుకూరి పాండురంగారావు మాట్లాడారు. యు.వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో కాకినాడ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మల్లిపూడి శ్రీరామచంద్రమూర్తి, రాష్ట్ర కాంగ్రెస్ సెక్రటరీ పెద్దాడ సుబ్బారాయుడు, పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను, బీసీ సెల్ కో ఆర్డినేటర్ కొల్లు వీరగణేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

'వైసీపీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారు'

పిఠాపురం, జనవరి 11: రాష్ట్రంలో అధికార వైసీపీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నారని కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు తెలిపారు. పిఠాపురం పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభాసదన్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మేడిది శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం జరిగిన నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు పిఠాపురం పట్టణంలోని కోర్టుల వద్ద న్యాయవాదులు చేస్తున్న దీక్షలకు పళ్లంరాజు సంఘీభావం తెలియజేశారు.

విశ్వ బ్రాహ్మణ సంఘ సభ్యులు ఏకగ్రీవం

కిర్లంపూడి, జనవరి11: కాకినాడ జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యులు కిర్లంపూడిలో బ్రహ్మంగారి ఆలయంలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అత్తిలి వీరబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన కార్యవర్గ సమావేశంలో ప్రధాన కార్యదర్శిగా కొమ్మోజు సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా కవులూరి శ్రీనివాస్, వర్కింగ్‌ప్రెసిడెంట్‌గా తుట్ట భాస్కరరావు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

బెదిరించే ప్రయత్నాలు మానుకోవాలి

● అంగన్‌వాడీల వినూత్న నిరసన, మానవహారం

● 31వ రోజుకు చేరిన సమ్మె

పిఠాపురం, జనవరి 11: డిమాండ్ల పరిష్కారం కోరుతూ 31రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు వినూత్నరీతిలో నిరసన తెలిపారు. సీఐటీయూ అనుబంధ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పిఠాపురం తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ధర్నా శిబిరంవద్ద 31వ రోజుని పురస్కరించుకుని 31 ఆకారంలో మానవహారం నిర్మించారు. సీఐటీయూ నాయకుడు కుంచే చిన్నా, యూనియన్ నాయకులు డి.తులసీదేవి, నళిని, ప్రజావాణి, బేబీ నాగగన్నిక, సత్యవతి, భవానీ, గౌరీ, వెంకటలక్ష్మి, అమల, సూర్యకాంతం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు షోకాజ్ నోటీసులు జారీ

గొల్లప్రోలు: అంగన్‌వాడీ వర్కర్ల సమ్మెపై ప్రభుత్వం మొండివైఖరిని ప్రదర్శిస్తోంది. డిమాండ్ల పరిష్కారం కోసం 31రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు అధికారులు గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈనోటీసులను ఐసీడీఎస్ అధికారులు, సచివాలయ సిబ్బంది ఆయా అంగన్‌వాడీ కేంద్రాల వద్ద అంటించారు. కాగా నోటీసులు జారీపై అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొత్తపల్లి: వేతనాలు పెంచాలని అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారానికి 31రోజుకి చేరింది. అంగన్‌వాడీలకు పంచాయతీ సిబ్బంది ద్వారా షోకాజ్‌నోటీసులు జారీ చేశారు. కొంత మందికి నోటీసులు అందజేశారు. అందుబాటులో లేనివారి ఇళ్ల గోడలకు నోటీసులను అంటించారు. 31రోజుకి చేరిన మానవహారాన్ని ప్రదర్శించారు. ఒక వృద్ధ మహిళ జగన్ రెడ్డికి మంచిబుద్ధి ప్రసాదించి అంగన్‌వాడీలకు వేతనాలు పెంచే విధంగా కరుణించాలని ఏసుక్రీస్తును ప్రార్థించారు.



కరప తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

తాళ్లరేవు: తాళ్లరేవు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో మాదవి ఆదేశాలతో సూపర్‌వైజర్లు 85 అంగన్‌వాడీ కేంద్రాలకు నోటీసులను గురువారం అంటించారు. ఒకపక్క 31రోజులపాటు అంగన్‌వాడీలు డిమాండ్ల సాధన కోసం తహసీల్దార్ కార్యాలయంవద్ద సమ్మెలో ఉంటే మరోపక్క విధులకు హాజరుకావాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం సోకాజ్ నోటీసులు జారీచేసింది.

పండగ మీకా..పస్తులు మాకా..!

కరప: పండగ మీకా..పస్తులుమాకా..అంటూ ముఖ్యమంత్రి జగన్‌పై అంగన్‌వాడీలు ధ్వజమెత్తారు. డిమాండ్ల పరిష్కారం కోరుతూ కరప తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చేస్తున్న ఆందోళన గురువారం 31వ రోజుకు చేరుకుంది. ఈ ఆందోళనలో నాయకులు పి.వీరవేణి, ఎం.భవానీ, బి.అచ్చారత్నం, ఆర్.దైవకుమారి, వరలక్ష్మి, నారాయణమ్మ పాల్గొన్నారు.

భ్రమల్లో మంత్రి రాజా మాట్లాడుతున్నారు

● జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్

కాకినాడ సిటీ, జనవరి 11: భ్రమల్లో ఉండి మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతున్నారని, వైసీపీ సాధికార యాత్రకు వందల మందే జనాలు వస్తుండడంతో అన్ని సభలు ఆయనకు అలాగే కనపడుతున్నాయని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఎద్దేవా చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతి వెళ్లాక టీడీపీ ఖాళీ అవుతుందని మంత్రి రాజా అనడం విడ్డూరంగా ఉంద న్నారు. తునిలో జరిగిన రా కదలి రా.. సభకు లక్షమంది దాటి వచ్చారన్నారు. సభకు జనసమీకరణ చేసి విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు నవీన్ కృతజ్ఞతలు తెలిపారు.

జనసేన ప్రత్తిపాడు అభ్యర్థిగా పోటీ చేయాలని ముద్రగడను కోరాం

● జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు

ప్రత్తిపాడు, జనవరి11: ప్రత్తిపాడు జనసేన అభ్యర్థిగా ఎన్నికల బరిలో పోటీ చేయాలని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను కోరామని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు చెప్పారు. ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి ముద్రగడను కలిశామని జనసేన పార్టీ తరుపున నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేయమని అభ్యర్థించామన్నారు. ముద్రగడ తమ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిస్తే అత్యధిక మెజార్టీతో విజయంసాధించగలరని తమ్మయ్యబాబు తెలిపారు. సంక్రాంతి తరువాత ముద్రగడ జనసేన పార్టీలో చేరే అవకాశాలు ఉన్నాయని, తమ్మయ్యబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కాకినాడ సిటీ, జనవరి 11: రజక వృత్తిదారుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్యాలెండర్‌ను గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో సంఘ నాయకుల ఆధ్వర్యంలో బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. వృత్తిదారుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కొనేటి రాజు, ప్రధాన కార్యదర్శి కొజ్జవరపు నాగేశ్వరరావు, పెదపూడి చంటి, కొజ్జవరపు మాణిక్యం, సత్యవాడ బాబ్జి, శీరందాసు రాజేష్, పొన్నాడ సూర్యనారాయణ, గార అప్పారావు, రాజు, శ్రీను పాల్గొన్నారు.

కార్మికుల పక్షపాతి చంద్రబాబు

● టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామరాజు

సర్పవరం జంక్షన్, జనవరి 11: సైకో సీఎం జగన్ నియంతృత్వ పాలనలో అన్నిరంగాల కార్మికులు రోడ్డున పడ్డారని, కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పాలన అందించిన చంద్రబాబుకు ఓట్లేసి తెలుగుదేశంపార్టీని అధికారంలోకి తీసుకొచ్చేలా కృషి చేయాలని ఆపార్టీ టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు కోరారు. గురువారం సర్పవరం జంక్షన్ వద్దకు చంద్రన్న కార్మిక చైతన్య బస్సుయాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణమూర్తి దంపతులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా, రాష్ట్ర కార్యదర్శులు కటకంశెట్టి బాబీ, కాళ్ల సత్తిబాబు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ వాసిరెడ్డి ఏసుదాసుల ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి జోన్-1 ఇన్ చార్జి కోగంటి లెనిన్, సాయిబాబా, రామకృష్ణ పాల్గొన్నారు.

చంద్రన్న కార్మిక బస్సు యాత్ర సామర్లకోట రాక

సామర్లకోట, జనవరి 11 టీఎన్టీయూసీ అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బస్సుయాత్ర సామర్లకోటకు చేరుకోగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ సారథ్యంలో టీడీపీ నాయకులు ఎదురేగి పూలమాలలు వేసి చంద్రన్న కార్మిక బస్సుయాత్రకు స్వాగతం పలికారు.

రా కదలిరా బహిరంగసభ విజయవంతం : చినరాజప్ప

సామర్లకోట, జనవరి 11: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు వైస్సార్‌సీపీ చేస్తున్న అన్యాయాలను, అక్రమాలను ఎత్తిచూపేందుకు టీడీపీ జాతీయాధ్యక్షుడు నారా చంద్రబాబు రా కదలిరాపేరిట తునిలో నిర్వహించిన ప్రచారకార్యక్రమం విజయవంతమైందని, జిల్లా నలుమూలలనుంచేగాక పొరుగు జిల్లాల నుంచి సైతం ఊహించని దానికన్నా భిన్నంగా ప్రజలు తరలివచ్చారని టీడీపీ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు నిమ్మకాయల చినరాజప్ప అన్నారు.

రా కదలి రా.. సభకు ఉప్పెనలా తరలివచ్చారు

● మాజీ ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, జనవరి 11: తుని రా కదలి రా.. సభ టీడీపీ శ్రేణులు విజయవంతం చేశారని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సభకు కాకినాడ జిల్లా నలుమూలల నుంచి ఉప్పెనలా ప్రజలు తరలివచ్చారన్నారు. నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, గదుల సాయి బాబు, పలివెల రవి పాల్గొన్నారు.

బటన్ నొక్కడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదు

● మాజీ ఎమ్మెల్యే వర్మ

గొల్లప్రోలురూరల్, జనవరి 11: వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం జగన్ బటన్ నొక్కడం తప్ప ప్రజలకు చేసిందేమీలేదని, రాష్ట్రాభివృద్ధిని గాలికి వదిలేశారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో గురువారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ ఆశీర్వదిద్దాం కార్యక్రమాలను నిర్వహించారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, సూపర్ సిక్స్ పథకాలు గురించి ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉలవకాయల దేవేంద్రుడు, మల్లిపూడి వీరబాబు, కోళ్ల బాబూరావు, వీరబాబు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన సునామీలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయం

సర్పవరం జంక్షన్, జనవరి 11: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, ఈ సునామీలో వైసీపీ బంగాళాఖాతంలో కొట్టుకుపోవడం ఖాయమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ వాసిరెడ్డి ఏసుదాసులు అన్నారు. గురువారం రమణయ్యపేట టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తునిలో జరిగిన చంద్రబాబు సభకు తండోపతండాలుగా వచ్చిన జనాలను చూచి వైసీపీ ప్రభుత్వంలో వణుకు మొదలైందన్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు భవిష్యత్ లేదు

వైసీపీ పాలనలో రెడ్డి సామాజిక వర్గానికి తప్పించి, బీసీలకు ఎటువంటి రాజకీయ భవిష్యత్‌లేదని, తెలుగుదేశం పార్టీ పుట్టిందే బడుగు, బలహీన వర్గాల నుంచి అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ డిప్యూటీ మేయర్ కాళ్ల సత్తిబాబు అన్నారు. గురువారం 2వ డివిజన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ పాలనలో బీసీ సామాజిక వర్గానికి తీరని అన్యాయం జరుగుతుందని విమర్శించారు.

టీడీపీ, జనసేనలతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్

ప్రత్తిపాడు, జనవరి 11: టీడీపీ, జనసేనలతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్‌అని టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభరాజా చెప్పారు. గురువారం ఆమె స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేనల కూటమి ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. ప్రజలంతా వైసీపీ అరాచక ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నారని ఇందుకు జిల్లాలో చంద్రబాబు తునిలో పాల్గొన్న బహిరంగసభకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు.

భవిష్యత్ గ్యారంటీకి అపూర్వ స్పందన

పెదపూడి, జనవరి 11: వైసీపీకి కంచుకోటగా చెప్పుకునే జీ.మామిడాడలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని గ్రామ ప్రజలు దుశ్శాలువాలతో సత్కరిస్తూ ఘనస్వాగతం పలికారు. నల్లమిల్లి మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పులు ఊబిలో కూరుకుపోయిందన్నారు. ప్రతి జనవరిలో జాబు క్యాలెండర్ విడుదల చేస్తామన్న జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి ఆమాటే మరిచారన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకులు జుత్తుక సూర్యకుమారి, బండి సత్యవతి, టీడీపీ నాయకులు జుత్తుక కృష్ణ, పుట్టా గంగాధర చౌదరి, గుంటా రాజు పాల్గొన్నారు.

పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

జగ్గంపేట, జనవరి 11: మండలంలోని రావులమ్మనగర్‌లోని నియోజకవర్గ టీడీపీ పార్టీ కార్యాలయంలో జగ్గంపేటకు చెందిన వైసీపీ సోషల్‌మీడియా గుర జాపు సోమసుందరం, దాసరి సూర్యప్రకాశరావు తదితరులు వైసీపీ పార్టీకి రాజీనామాచేసి రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ నెహ్రూ, టీడీపీ కండువాలతో పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా సుందరం మాట్లాడుతూ వైసీపీ సోషల్ మీడియాలో చురుకుగా పనిచేసి ఈరోజు రాష్ట్రం అభివృద్ధిలో వెనక పడడంతో మళ్లీ సోషల్‌మీడియా ద్వారానే తగిన బుద్ధి చెబుతామన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

సర్పవరం జంక్షన్, జనవరి 11: సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి పండుగ నిలుస్తోందని, ప్రజలంతా ఆనందోత్సాహాలతో ఈ పండుగను జరుపుకోవాలని జనసేన కాకినాడరూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీ కోరారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా జనసేనపార్టీ ఆధ్వర్యంలో గురువారం కాకినాడ 2వ డివిజన్ సిటీ కాలనీలో మన ఊరు-మన ఆట పిలుపులో భాగంగా మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. రంగవల్లుల పోటీల్లో ప్రతిభ కనబరచిన పలువురు మహిళలకు ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులుగా మిక్సీ గ్రైండర్, గ్యాస్ స్టవ్, నాన్‌స్టిక్ పేన్‌లను అందజేశారు.

ఎస్వీఎస్, పీజీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

కిర్లంపూడి, జనవరి 11: జగపతినగరంలోగల ఎస్వీఎస్ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కళాశాల అధినేత బావిశెట్టి రమణ, శ్వేత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కిర్లంపూడి ఎస్ఐ ఉమామహేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కళాశాలలో ముగ్గుల పోటీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఆదినారాయణ, అడ్వకేట్ పాలాట్ల కాశీ ప్రసాద్,రిటైర్డ్ ఉపాధ్యాయులు సూరిబాబు పలువురు పాల్గొన్నారు.

సాహితీ స్కూల్లో..

జగ్గంపేట, జనవరి 11: జగ్గంపేట సాహితీ స్కూల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముందుగా భోగి మంటలు వేసి పొంగలి వండి సంబరాలు ప్రారంభించారు. పిల్లలు సాంప్రదాయ దుస్తులో అలంరించారు. కరస్పాండెంట్ వర్మ మాట్లాడుతూ మన దేశంలో సంక్రాంతి చాలా ప్రాముఖ్యమైనదన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్న సంక్రాంతి సంబరాలు

కరప: కాకినాడరూరల్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లోని మహిళలను ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్న సంక్రాంతి సంబరాలు నిర్వహించినట్లు జడ్పీటీసీ యాళ్ళ సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి తెలిపారు. గ్రామ పంచాయతీ వద్ద గురువారం రంగవల్లులు, మ్యూజికల్ చైర్స్, స్పూన్ అండ్ లెమన్ పోటీలు నిర్వహించారు. ఎంఈవో1 కె బుల్లికృష్ణవేని ఆధ్వర్యంలో టీచర్లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి ఒక్కో ఈవెంట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను ఎంపిక చేశారు. పోటీల్లో పాల్గొన్న 119 మందికి ప్రోత్సాహబహుమతు అందజేశారు.

ఘనంగా యువజనోత్సవాలు

కాకినాడ రూరల్, జనవరి 11: కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడీయల్ డిగ్రీకళాశాలలో యువజనోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల అకడమిక్ డైరెక్టర్ మెర్ల రంజిత్ తెలిపారు. ఈ ఉత్సవాలను కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించగా అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ కేఎస్ వాసు స్వాగతం పలికారు. యువజనోత్సవాల్లో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కూచిపూడి నృత్యం, కళాప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. అరుణ్‌వీర్ దర్శకత్వంలో యూట్యూబ్‌లో విడుదలైన నవ్వుతూ బ్రతకాలిరా సినిమాని విద్యార్థులచేత ప్రారంభించారు. జబర్దస్త్ టీమ్ కామెడీ ప్రదర్శనలు విద్యార్థులను అలరించాయి. అధ్యాపకులు, అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా శుభానికేతన్‌లో 35వ వార్షికోత్సవం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్ సుభాషిణి

సర్పవరం జంక్షన్, జనవరి 11 : కాకినాడ రూరల్ సర్పవరంలో గురువారం శుభానికేతన్ పాఠశాల 35వ వార్షికోత్సవంను ఆ స్కూల్ అధ్యక్షురాలు సుభాషిణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఉత్తమ విద్యాబోధన అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు కాంపిటేటివ్, సాంస్కృతిక పోటీల్లో రాణించిన విద్యార్థులకు ప్రసంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

'జగనన్న తోడు' రుణాలు అందజేత

కాకినాడ సిటీ, జనవరి 11: చిరు వ్యాపారులకు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎంపీ వంగా గీత అన్నారు. జగనన్న తోడు పథ కం కింద ఎనిమిదో విడత చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతివృత్తుల వారికి బ్యాంకుల ద్వారా రూ.10 వేల చొప్పున వడ్డీ లేని రుణాలను జమ చేసే కార్యక్రమాన్ని గురువారం సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. దీనికి కలెక్టరేట్‌నుంచి ఎంపీ గీత, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కలెక్టర్ కృతికాశుక్లా, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు, లబ్ధిదారులతో కలసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 10,995మంది లబ్ధిదారులకు రూ.11.12కోట్లు వడ్డీ లేని రుణాలు అందనున్నాయన్నారు.

'మాతృ మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలి'

జీజీహెచ్(కాకినాడ), జనవరి 11: మాతృ మరణాల నివారణకు కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ కోరారు. కాకినాడలో వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో మాతృ మరణాలపై జిల్లా కమిటీ సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉన్న గర్భిణులు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ రత్నకుమార్, డాక్టర్ ఎస్.అరుణ, డాక్టర్ స్వప్న, డాక్టర్ జయధీర్ పాల్గొన్నారు.

రైల్వే అధికారి బదిలీ

సామర్లకోట, జనవరి 11: సామర్లకోట రైల్వేస్టేషన్ సహాయ పాయింట్స్ మెన్‌గా పనిచేస్తున్న రాజేష్‌కుమార్ సింగ్‌కు పదోన్నతిపై భీమవరం స్టేషన్‌కు బదలీ చేస్తూ విజయవాడ రైల్వే డీఆర్ఎం కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా సామర్లకోట స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో గురువారం వీడ్కోలు సత్కారం ఘనంగా నిర్వహించారు. కెవీ. గిరి, అనంతలక్ష్మీ తదితర సిబ్బంది పాల్గొని బదలీ అయిన రాజేష్‌కుమార్ సింగ్‌ను ఘనంగా వీడ్కోలు పలికారు.

భీమేశ్వరాలయ ప్రధాన అర్చకుడు జోగారావు మృతి



సామర్లకోట, జనవరి 11: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ప్రధాన అర్చకుడు అయిన కొంతేటి జోగారావు అస్వస్థతతో గురువారం మృతి చెందారు. వంశపారంపర్య అర్చకులలో భాగంగా జోగారావు తండ్రి తర్వాత గత 40 సంవత్సరాలుగా ప్రధాన అర్చకుడిగా పనిచేస్తున్నారు. జోగారావుకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. జోగారావు మృతి పట్ల ఆలయ కార్యనిర్వహణాధికారి డి.నాగమల్లేశ్వరరావు, అభిషేక పండితులు వేమూరి సోమేశ్వ రవర్మ, చెరుకూరి రాంబా బు, లక్షపత్రిపూజా నిర్వాహకులు చీమలకొండ గోపాలం, వెంకన్న, అంజిబాబు, పండితులు తీవ్ర సంతాపం తెలి పారు. జోగారావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన వారిలో కంచి మహాసంస్థానం ఆలయ వ్యవస్థాపక కుటుంబీకులు చంద్రాభట్ల పతంజలి, భీమేశ్వర అన్నదాన ట్రస్ట్ ప్రతినిధులు బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ, చుండ్రు గోపాలకృష్ణ, ఆర్వీ. సుబ్బరాజు, గంజి బూరిబాబు ఉన్నారు.

సాహిత్యంలో యనమదలకు విశిష్ట పురస్కారం



ఏలూరులో పురస్కారం అందుకుంటున్న డాక్టర్ మురళీకృష్ణ

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 11: రాష్ట్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఏలూరులోని వైఎం హెచ్ఏ హాలులో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో సాహిత్య విభాగానికి సంబంధించి విశిష్ట పురస్కారాన్ని ప్రముఖ హెచ్ఐవీ నిపుణులు డాక్టర్ యనమదల మురళీకృష్ణకు గురువారం అందజేశారు. సాహిత్య ప్రక్రియలో విశేష ప్రతిభచూపిన పదిమందికి విశిష్ట పురస్కారం అందించగా వారిలో కాకినాడకు చెందిన యనమదల మురళీకృష్ణ కూడా పురస్కారం అందు కున్నారు. రాష్ట్ర సాంస్కృతికశాఖ కమిషనర్ రేమేళ్ల మల్లికార్జునరావు, సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్‌ప్రసన్న, జేసీ లావణ్యవేణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యనమ దలను శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపిక అందజేశారు.

ఎమ్మెల్యే దొరబాబు నిర్ణయం ఎటు?

● నేడు పుట్టినరోజుకు భారీ ఏర్పాట్లు

● ఫ్లెక్సీలో సీఎం జగన్ ఫొటో మాయం

పిఠాపురం, జనవరి11: పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు తన రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయం ప్రకటిస్తారా. ఇది ప్రస్తుతం నియోజకవర్గ ప్రజల్లో చర్చనీయాంశంగా మారిన అంశం. శుక్రవారం ఆయన పుట్టినరోజు వేడుకలను భారీగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. వైసీపీ అధిష్ఠానం దొరబాబుకు ఎమ్మెల్యే టిక్కెట్టును నిరాకరించి వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్‌ను ప్రకటించిన తర్వాత జరుగుతున్న కార్యక్రమం కావడంతో దీన్ని విజయవంతం చేసేందుకు, తద్వారా బలప్రదర్శన చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. వచ్చిన



నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు శుక్రవారం భారీగా విందు ఏర్పాటు చేశారు. దొరబాబుకు పుట్టినరోజు సందర్భంగా అధికార వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఎక్కడా సీఎం జగన్, ఇత ర ముఖ్య నేతల ఫొటోలు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్ : గుంటూరు కారం, హనుమాన్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్ : గుంటూరు కారం

తిరుమల	:	గుంటూరు కారం
లక్ష్మి	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ1	:	హనుమాన్
సీ అండ్‌సీ2	:	గుంటూరు కారం
శ్రీప్రియ	:	గుంటూరు కారం
పద్మప్రియ	:	గుంటూరు కారం
సత్యగౌరి	:	గుంటూరు కారం
సూర్య 1	:	గుంటూరు కారం
సూర్య 2	:	గుంటూరు కారం